మా పాలనలో పేపర్ లీక్ కాలేదు.. తెలంగాణలో నిషేధానికి గురైన కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు: కేజ్రీవాల్ 2

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

## రిపోర్టర్లు కావలెను

నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పాముగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 64 | జూన్ 6 శనివారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 64 | PAGES:4 | SATURDAY JUNE 6 2026 | Rs. 4:00

# ఏపీతో చర్చలు జరుగుతున్నాయి..
# ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం
## – సీఎం రేవంత్ రెడ్డి








- పాలమూరు ప్రాజెక్టును సందర్శించిన రేవంత్ రెడ్డి
- ఏపీతో సమస్యల పరిష్కారికే ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి
- ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం
- బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని విమర్శ

"తెలంగాణ నీటిపై రాజీ పడేది లేదు.. మన హక్కు కోసం పోరాడతాం"

తెలంగాణ నీటి హక్కులపై రాజీపడేది లేదు..
**మన హక్కు – మన పోరాటం**

పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఏపీతో చర్చలు జరిపినా రాష్ట్ర చట్టబద్ధమైన వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము 'పంచాయతీ' కంటే 'పరిష్కారానికే' ప్రాధాన్యత ఇస్తామని... పాలమూరు, డిండి పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ వస్తేనే మిగతా చర్చలు ముందుకు సాగుతాయని తేల్చి చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం భూసేకరణ పనులను కూడా పూర్తి చేయకపోవడం వల్లే ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. కష్టకాలంలో కేసీఆర్‌ను ఆదుకున్న పాలమూరును అధికారంలోకి వచ్చాక ఆయన పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. వలసల జిల్లా అయిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం..

ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.

## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు

- బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వెల్లడి
- భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా 38 శాతం అని వెల్లడి
- ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ
- 'ఆంధ్రా ష్రింప్.. ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్ స్థాపించాలని పిలుపు

భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని,

(మిగతా 2వ పేజీలో..)



## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

- పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె
- రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి హైడ్రా రక్షణ
- చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు చర్యలు



## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం: గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు




- ఒకే అంతర్జాతీయ విమానంలో ప్రయాణించిన ముగ్గురిలో లక్షణాలు
- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి ఎయిర్‌పోర్ట్‌లోనే గుర్తింపు
- నిర్ధారణ కోసం నమూనాలను పూణె వైరాలజీ ల్యాబ్‌కు పంపిన అధికారులు
- ఆందోళన వద్దని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖ వెల్లడి

భాగ్యనగరంలో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. ఎబోలా తరహా లక్షణాలతో ముగ్గురు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంతో అప్రమత్తమైన తెలంగాణ ఆరోగ్య శాఖాధికారులు, బాధితులను ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్యుల నిరంతర



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం: గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షణలో ఉంచారు.వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం ఎబోలా ప్రాథమిక లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిని ఆశ్రయించారు. పరిస్థితిని గమనించిన వైద్యులు వారిని తక్షణమే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో గాంధీలో చేరిన ఎబోలా అనుమానితుల సంఖ్య మూడుకు చేరుకుంది. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముగ్గురు ఒకే అంతర్జాతీయ విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నట్లు వెల్లడి కావడంతో, సదరు విమానంలో ప్రయాణించిన ఇతర ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.కాగా, అంతకుముందు గురువారం నాడు సూడాన్ నుంచి ఇథియోపియా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న 30 ఏళ్ల వ్యక్తిని విమానాశ్రయ వైద్య బృందం గుర్తించింది. థర్మల్ స్క్రీనింగ్‌లో అతనికి 100 డిగ్రీల జ్వరం ఉన్నట్లు తేలింది. ఇటీవల ఎబోలా ప్రభావిత దేశాలైన ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో అతడు పర్యటించినట్లు సమాచారం అందడంతో, అధికారులు ముందుజాగ్రత్తగా అతడిని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు.ప్రస్తుతం ఆ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎబోలా తీవ్రతను సూచించే రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు ప్రస్తుతానికి ఎవరిలోనూ కనిపించడం లేదని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను తుది నిర్ధారణ పరీక్షల నిమిత్తం పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (చీ×ఎ)కి పంపారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖాధికారులు భరోసా ఇచ్చారు. పూణె నుంచి వచ్చే నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వారు వెల్లడించారు.

## 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది.ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన పుతిన్‌కు రాసిన ఒక బహిరంగ లేఖను పుతిన్ స్వీకరించి, పూర్తిగా చదివినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం (క్రెమ్లిన్) అధికారికంగా వెల్లడించింది. రష్యా అగ్రశ్రేణి వార్తా సంస్థ 'టాస్' కథనం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరమ్ (ఙ్రా×జుఖీ) సదస్సు సందర్భంగా పుతిన్ ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు."మన మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఈ యుద్ధానికి ముగింపు పలుకుదాం. ఇందుకోసం నేను ఒక సమావేశాన్ని ప్రతిపాదిస్తున్నాను" అని జెలెన్‌స్కీ తన లేఖలో పేర్కొన్నారు. "యూరప్ దృష్టి మళ్లీ ఈ యుద్ధంపై పడే వరకు వేచి చూడటం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు స్విట్జర్లాండ్, టర్కీ, అరబ్ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. చర్చలకు స్పష్టమైన తేదీని నిర్ణయించుకోవాలని కూడా ప్రతిపాదించారు.చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ తన లేఖలో హామీ ఇచ్చారు. "ఇది ప్రామాణికమైన పద్ధతి. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి నిజమైన నిశ్శబ్దాన్ని నెలకొల్పడమే ఉత్తమ మార్గం. ఇది కేవలం ప్రయత్నం కాదు, మీకు నిజంగా ఆసక్తి ఉంటే ఇది నిజమైన కాల్పుల విరమణ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ లేఖపై ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన స్పందనల గురించి కూడా పుతిన్‌కు తెలియజేశామని పెస్కోవ్ తెలిపారు. ఈ పరిణామంపై పెస్కోవ్ స్పందిస్తూ, చర్చలను పునఃప్రారంభించాలని రష్యా కోరుకుంటోందని అన్నారు.

## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశ బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగ అభివృద్ధికి తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు గణాంకాలతో వివరించారు. "దేశ మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతం, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం మనదే. దేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 38 శాతం, అంటే సుమారు రూ.28,000 కోట్లకు పైగా ఏపీ నుంచే సమకూరుతోంది. ప్రపంచ సీ-ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం 5 శాతమే ఉంది. దీన్ని పెంచడానికి అపార అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, దేశ ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి" అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆక్వా రంగం సమగ్రాభివృద్ధికి ఒక బృహత్ ప్రణాళికను చంద్రబాబు ప్రకటించారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక 'ఆక్వా కారిడార్' అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. "ఈ కారిడార్‌లో పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఆధునిక టెక్నాలజీతో కూడిన ఒక సమగ్ర ఎకో సిస్టం ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే మా లక్ష్యం. 'పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్' అనే విధానంతో ముందుకు సాగుతాం" అని తెలిపారు. 'ఆంధ్రా రొయ్య... ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 15 రోజుల్లోగా అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని గుర్తుచేశారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. "21వ శతాబ్దం నరేంద్ర మోదీదే. సరైన సమయంలో దేశానికి దొరికిన సరైన నేత ఆయన. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా కృషి చేస్తున్నారు. ఆయనను మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశానికి తాను సైకిల్‌పై వచ్చానని, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని సూచించారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు: సీఎం డీకే శివకుమార్

కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వంలో అప్పుడే అసమ్మతి సెగలు మొదలయ్యాయి. తాను ఆశించిన బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కలేదన్న అసంతృప్తితో సీనియర్ మంత్రి ఆర్. రామలింగారెడ్డి తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. అయితే, శాఖల కేటాయింపు తన చేతుల్లో లేదని, అది పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానం పరిధిలోని అంశమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు.ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్‌కు ఈ పరిణామం తొలి సవాల్‌గా మారింది. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రామలింగారెడ్డి, తనకు కేటాయించిన జలవనరుల శాఖ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం రాజీనామా చేశారు. గతంలో తనకు బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయిస్తానని డీకే శివకుమార్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ శాఖను కృష్ణ బైరేగౌడకు కేటాయించారని ఆయన పేర్కొన్నారు.ఈ అంశంపై స్పందించిన సీఎం డీకే శివకుమార్, రామలింగారెడ్డికి హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. "నేను నా వంతు ప్రయత్నం చేశాను, కానీ తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంది. ఆయన నా మిత్రుడు, స్వయంగా వెళ్లి ఆయనతో మాట్లాడతాను" అని శివకుమార్ తెలిపారు. మరోవైపు, రామలింగారెడ్డి తన రాజీనామా లేఖపై బహిరంగంగానే సంతకం చేశారు. తనకు పదేపదే అవమానం జరుగుతోందని, ఆత్మసాక్షికి విరుద్ధంగా పనిచేయలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను పార్టీలోనే కొనసాగుతానని, కేవలం మంత్రి పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వివాదంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోందని, ఒకవేళ ఆయన మెత్తబడకపోతే రాజీనామాను ఆమోదించే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పార్టీ అగ్రనేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.



## మా పాలనలో పేపర్ లీక్ కాలేదు.. తెలంగాణలో నిషేధానికి గురైన కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు: కేజ్రీవాల్

### కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక లీకులు పెరిగాయని ఆరోపణ

### వేల కోట్ల వ్యాపారంగా మారిన పేపర్ లీకుల వెనుక పెద్ద మాఫియా ఉందని వ్యాఖ్య

### లీక్‌లపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత నిరసనలు చేయాలని పిలుపు

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

తమ పదేళ్ల ఢిల్లీ పాలనలోగానీ, నాలుగేళ్ల పంజాబ్ పాలనలోగానీ ఇప్పటివరకు ఒక్క ప్రశ్నపత్రం కూడా లీక్ కాలేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షా పత్రాల లీకేజీలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా మారాయని ఆయన ఆరోపించారు. దీని వెనుక ఉన్నత స్థాయి వ్యక్తులతో కూడిన ఒక పెద్ద మాఫియా ఉందని, ఇది వేల కోట్ల రూపాయల వ్యాపారంగా రూపాంతరం చెందిందని విమర్శించారు. రాజకీయ అండదండలు లేకుండా ఇటువంటి లీకేజీలు జరగడం అసాధ్యమని పేర్కొన్నారు. గతంలో ఢిల్లీలో తమ ప్రభుత్వం పటిష్ఠమైన పాలనా యంత్రాంగంతో పరీక్షల సమగ్రతను కాపాడిందని, ఇప్పుడు పంజాబ్ లో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా, గతంలో తెలంగాణలో నిషేధానికి గురైన ఒక సంస్థకు సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ కాంట్రాక్టును అప్పగించడాన్ని ఆయన తప్పుపట్టారు. సదరు కంపెనీ చేసిన తప్పిదాల కారణంగానే గతంలో 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అపఖ్యాతి పాలైన అటువంటి సంస్థపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్ష రద్దు కావడంపై కేజ్రీవాల్ స్పందించారు. ఈ లీకేజీల సమస్యకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల నుంచి తగినంత ఒత్తిడి రాకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని, తద్వారా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## 'పెద్ది'లో జాన్వీ పాత్రపై వివాదం.. ఇది ఖరీదైన అవమానం అంటూ సింగర్ పోస్ట్



రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో జూన్ 4న విడుదలైన 'పెద్ది' చిత్రం వివాదాలకు కేంద్రబిందువైంది. ఈ చిత్రంలో హీరో పాత్రకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నప్పటికీ, హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్రను కేవలం గ్లామర్‌కే పరిమితం చేస్తూ అసభ్యంగా చిత్రీకరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ గాయని సుమంగళి అరియనాయగం ఈ అంశంపై చిత్ర బృందాన్ని తప్పుబడుతూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్, ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది."భారతీయ సినిమాలో ఒక ప్రముఖ కథానాయికకు జరిగిన అత్యంత ఖరీదైన అవమానం" అనే శీర్షికతో 'రిఫరెన్స్ కమ్యూనిటీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ చేసిన పోస్ట్ ఈ వివాదానికి మూలమైంది. కథలో హీరో పాత్రకు బలమైన సామాజిక నేపథ్యం ఉన్నప్పటికీ, హీరోయిన్ పాత్రను మాత్రం కేవలం రొమాంటిక్ సన్నివేశాలకు, గ్లామర్ ప్రదర్శనకు పరిమితం చేశారని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.విశేషమేమిటంటే, ఈ పోస్ట్‌ను జాన్వీ కపూర్ స్వయంగా లైక్ చేయడంతో, తన పాత్ర చిత్రణ పట్ల ఆమె కూడా అసంతృప్తిగా ఉన్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.ఈ పోస్ట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న గాయని సుమంగళి, "అధికారం లేకపోవడం వల్ల కలిగే వేదన గురించి కథను సిద్ధం చేయడానికి శక్తివంతమైన పురుషులందరూ ఒకచోట చేరారు. కానీ, అదే సమయంలో జాన్వీ కపూర్ పాత్రను కెమెరా ముందు కేవలం ఒక శరీరంగా, బలవంతపు ముద్దులకు వస్తువుగా, పాటల వరకే పరిమితమైన ఒక సాధనంగా మార్చేశారు" అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సుమంగళి వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, భారీ బడ్జెట్ చిత్రాలలో మహిళా పాత్రల చిత్రణపై విస్తృత చర్చ మొదలైంది. ఒకవైపు 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనమైన వసూళ్లు సాధిస్తున్నప్పటికీ, హీరోయిన్ పాత్రను తీర్చిదిద్దడంలో దర్శకుడు విఫలమయ్యారని పలువురు సినీ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విమర్శలపై చిత్ర బృందం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## రామానాయుడు స్టూడియోలో నా ఫొటో ఉండాలనే కోరిక నెరవేరింది: ప్రియమణి

నేషనల్ అవార్డ్ విన్నర్, సీనియర్ నటి ప్రియమణి టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో వచ్చిన 'నారప్ప' చిత్రంలో ఆమె పోషించిన సుందరమ్మ పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుండి భారీ ప్రశంసలు దక్కాయి. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై పెద్ద సక్సెస్ సాధించింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ... ఈ సినిమాకు సంబంధించి, అలాగే తన కెరీర్‌కు సంబంధించిన ఒక కీలక విషయాన్ని పంచుకుంది. "చాలా ఏళ్ల క్రితం నేను రామానాయుడు స్టూడియోలో షూటింగ్ చేస్తున్న సమయంలో, అక్కడ ఒక గోడపై ఎంతోమంది ప్రముఖ నటీమణుల ఫొటోలు అందంగా అలంకరించి ఉండటం చూశాను. అప్పట్లో వాటి ప్రాధాన్యత నాకు పూర్తిగా తెలియదు. కానీ ఆ తర్వాత తెలిసింది.. వారంతా ప్రతిష్ఠాత్మక 'సురేష్ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో నటించిన లెజెండరీ హీరోయిన్లు అని. ఆ రోజే నా మనసులో ఒక బలమైన కోరిక కలిగింది.. ఎలాగైనా భవిష్యత్తులో ఆ గోడపై నా ఫొటో కూడా స్థానం సంపాదించుకోవాలని అనుకున్నాను" అని చెప్పుకొచ్చింది.ఆమె అనుకున్నట్లుగానే కొన్ని సంవత్సరాల తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ నుండి 'నారప్ప' రూపంలో ఆమెకు అద్భుతమైన అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన నటించడమే కాకుండా, సురేష్ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్‌లో పనిచేయాలనే దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేసింది. డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ఒక గొప్ప విజన్ ఉన్న దర్శకుడని, నారప్ప చిత్రాన్ని ఎంతో అద్భుతంగా, భావోద్వేగభరితంగా తెరకెక్కించారని కొనియాడింది. 'నారప్ప' సినిమాలో నటించడం వల్లే ఈ రోజు రామానాయుడు స్టూడియోలో ఆ హీరోయిన్ల ఫొటోల పక్కన తన ఫొటో కూడా చేరిందని, ఆ కోరిక నెరవేరడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని ప్రియమణి భావోద్వేగానికి లోనైంది.





## ట్రోల్స్ పట్టించుకోను: నిధి అగర్వాల్

**వరుసగా పరాజయం పాలవుతున్న నిధి నటించిన సినిమాలు**

**ఐరన్ లెగ్ అంటూ ట్రోల్ చేస్తున్న నెటిజన్లు**

**తాను టాలెంట్ ను మాత్రమే నమ్ముకుంటానన్న నిధి**

టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ కి ఈ మధ్య కాలంలో అదృష్టం పెద్దగా కలిసిరావడం లేదు. 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' లాంటి పెద్ద చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోవడంతో... సోషల్ మీడియాలో నిధిపై కొందరు నెటిజన్లు తీవ్రంగా నెగెటివ్ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. కేవలం టాలెంట్ ఉంటే సరిపోదని, ఇండస్ట్రీలో రాణించడానికి అదృష్టం కూడా ఉండాలంటూ విమర్శిస్తూ.. ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం స్టార్ట్ చేశారు.ఈ ట్రోల్స్‌పై నిధి అగర్వాల్ స్పందిస్తూ... తాను విమర్శలను పట్టించుకోనని చెప్పింది. పొగడ్తలను కూడా తలకెక్కించుకోనని స్పష్టం చేసింది. విజయవంతమైన నటిగా పేరు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుందని... తాను కూడా దానికి మినహాయింపు కాదని తెలిపింది. సినిమా సక్సెస్ అనేది కేవలం ఒకరిద్దరి మీద కాకుండా చాలా విషయాలపై ఆధారపడి ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. తను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయినప్పుడు చాలా సంతోషించానని, ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, తనను తాను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపింది. తాను 'లక్' కంటే కేవలం తన 'టాలెంట్'ను మాత్రమే నమ్ముకుంటానని తేల్చి చెప్పింది.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**